# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-11-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **స్వాతంత్ర్య ఉద్యమంలో గిరిజనులు మహోన్నత పాత్ర పోషించారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.**

2. **సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారు.**

3. **రానున్న మూడున్నరేళ్లలో పరిశ్రమల ఏర్పాటుకు చేసుకున్న ఒప్పందాలు కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

4. **ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరుకు రానున్నారు.**

5. **గురుకులాల మెనూలో చేపలను చేర్చనున్నట్లు తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.**

==========================

స్వాతంత్ర్య ఉద్యమంలో గిరిజనులు మహోన్నత పాత్ర పోషించారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. గిరిజనులపై బ్రిటీష్ పాలకుల అరాచకాలను భగవాన్ బిర్సా ముండా ఎదుర్కొన్నారని చెప్పారు. గుజరాత్‌లోని నర్మదా జిల్లా దేడియాపాడ పట్టణంలో భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి వేడుకలను పురస్కరించుకుని, జన్ జాతీయ గౌరవ దినోత్సవం సందర్భంగా ఆయన నిన్న 9 వేల 700 కోట్ల రూపాయల వ్యయంతో వివిధ ప్రాజెక్టులు, అభివృద్ధి పథకాలను ప్రారంభించి, శంఖుస్థాపనలు చేశారు. భగవాన్ బిర్సా ముండా విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి మాట్లాడుతూ.. గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ఇందుకోసం అనేక పథకాలను రూపొందించి అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

--------------------------

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ నిన్న ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ చేరుకున్నారు. ఢిల్లీ నుంచి విజయవాడ విమానాశ్రయానికి చేరుకున్న జస్టిస్ గవాయ్‌కు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ స్వాగతం పలికారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ...గుంటూరు జిల్లా మంగళగిరిలో ఈరోజు నిర్వహిస్తున్న కార్యక్రమం... ‘75 ఏళ్ల

భారత దేశం – సజీవ భారత రాజ్యాంగం' అనే అంశంపై జస్టిస్ గవాయ్ ప్రసంగించనున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ లు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు.

---------------------------

విశాఖపట్నం భాగస్వామ్య సదస్సులో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలు రానున్న మూడున్నరేళ్లలో కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఎక్కడా జాప్యం లేకుండా అధికారులు, మంత్రుల కమిటీ ఎప్పటికప్పుడు నిర్దిష్ట కార్యాచరణతో ముందుకెళ్తుందని చెప్పారు. దెబ్బతిన్న ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ ను పునరుద్ధరిస్తున్నామని వెల్లడించారు. భాగస్వామ్య సదస్సు ముగింపు సందర్భంగా పాత్రికేయులతో నిన్న ఆయన మాట్లాడుతూ..

..వాయిస్.. 30 సెకన్లు

---------------------------

శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో సత్యసాయిబాబా మహాసమాధిని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియుష్ గోయల్ నిన్న దర్శించుకున్నారు. సత్యసాయి బాబా శత జయంతి వేడుకల్లో పాల్గొనడానికి పుట్టపర్తికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ... సత్య సాయి బాబా చేసిన సేవలు అమోఘమని, శాంతి, ప్రేమ, సేవలను చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి అని పేర్కొన్నారు. ప్రశాంతి నియలం విశిష్టతను వివరిస్తూ...

..వాయిస్...30 సెకన్లు

---------------------------

ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరుకు రానున్నారు. భగవాన్ బిర్సా ముండా 150 వ జయంతి సందర్భంగా జన జాతీయ గౌరవ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాడేరు మండలం, చింతల వీధి వై జంక్షన్ వద్ద, ఏర్పాటు చేసిన బిర్సా ముండా విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించనున్నారు. అనంతరం పాడేరు జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. రాష్ట్ర మంత్రులు గుమ్మిడి సంధ్యారాణి, కందుల దుర్గేష్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్, మాధవ్ లు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

---------------------------

భగవాన్ బిర్సా ముండా దేశానికే స్ఫూర్తి అని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు తెలిపారు. విశాఖపట్నం రుషికొండలో బిర్సా ముండా 150వ జయంతి వేడుకలను నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. గిరిజనులపై బ్రిటీష్ పాలకుల అరాచకాలకు వ్యతిరేకంగా బిర్సా ముండా పోరాటం చేశారన్నారు. గిరిజన హక్కులు, స్వాతంత్ర్యం కోసం ఎనలేని పోరాటాలు చేశారని బిర్సా ముండా జీవితాన్ని అందరికీ తెలియజేయాలని ఈ కార్యక్రమం చేపట్టామని పేర్కొంటూ..

వాయిస్.. 30 సెకన్లు

---

గురుకులాల మెనూలో చేపలను చేర్చనున్నట్లు తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సిద్ధిపేట జిల్లా, హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువులో మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఆయన నిన్న 3 లక్షల చేప పిల్లలను వదిలారు. హుస్నాబాద్ ప్రాంత ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ..

వాయిస్…15 సెకన్లు

---

ఆంధ్రప్రదేశ్ లోని ఎన్టీఆర్ జిల్లా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రసార భారతి – సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈరోజు సాయంత్రం ఆరు గంటలకు సంగీత సమ్మేళనాన్ని దూరదర్శన్, ఆకాశవాణి సంయుక్తంగా నిర్వహించనున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా హాజరు కానున్నారు. ఆరు దశాబ్దాలకు పైగా చరిత్ర కలిగిన ఈ ప్రతిష్ఠాత్మక వార్షిక కార్యక్రమంలో శాస్త్రీయ సంగీతం, భక్తి సంగీతం ఆలపించనున్నారు.

---

కోల్ కతాలోని ఈడెన్ గార్డెన్స్ లో భారత్, దక్షిణ ఆఫ్రికాల మధ్య జరుగుతున్న క్రికెట్ తొలి టెస్టులో దక్షిణ ఆఫ్రికా రెండవ ఇన్నింగ్స్ రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 93 పరుగులకే 7 వికెట్లు కోల్పోయింది. అంతకు ముందు మొదటి ఇన్నింగ్స్ లో భారత జట్టు ఒక వికెట్ నష్టానికి 37 పరుగులతో రెండవ రోజు మ్యాచ్ ను ప్రారంభించగా, 189 పరుగులు చేసి ఆల్ అవుట్ అయ్యింది. మూడవ రోజు ఆట ఈ ఉదయం 9 గంటల 30 నిముషాలకు ప్రారంభం కానుంది.

---

ఆంధ్రప్రదేశ్ లో రాష్ట్రంలోని చలి తీవ్రత కొనసాగుతుంది. ఒడిశా, తెలంగాణా సరిహద్దుల్లోని పలు ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి. అరకులో గత రాత్రి 7 డిగ్రీలు కనిష్ట ఉష్ణోగ్రత నమోదయ్యిందని అధికారులు తెలిపారు.

తెలంగాణాలో మరో రెండు రోజులు రాష్ట్ర వ్యాప్తంగా చలి వాతావరణం కొనసాగే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

---

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 128వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 28వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

======================